సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్

కైలాస్‌నగర్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాహుల్ రాజ్‌ను జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ సోమవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.



చింతగూడెం అబ్బాయి.. మయన్మార్ అమ్మాయి

10లో▸

గుడిహత్నూర్ మండలం అబ్బాయి.. మయన్మార్ దేశానికి చెందిన అమ్మాయి ప్రేమించుకున్నారు. ఇరు కుటుంబాలు పెళ్లికి నమ్మతించడంతో సోమవారం ఆ జంట ఒక్కటైంది.

గరిష్టం/కనిష్టం
34.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలితో తేమశాతం పెరగనుంది. రాత్రివేళలో, వేకువ జామున శీతల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పదోన్నతులు కల్పించాలని పండితుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న భాషా పండితులు

ఆదిలాబాద్‌టౌన్: పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ భాషా పండితులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 25 ఏళ్లుగా పదోన్నతి లేకుండా భాషా పండితులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. ప్రస్తుతం కల్పిస్తున్న పదోన్నతుల్లో తమకు అవకాశం కల్పించాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు జాబ్‌చార్ట్ ప్రకారం 6 నుంచి 8 తరగతుల వరకే విద్యాబోధన చేస్తామని పేర్కొన్నారు. 9,10 తరగతులకు బోధన చేయబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవోనం. 2, 3 ప్రకారం పదోన్నతులు కల్పించాలన్నారు. ఇందులో భాషా పండితులు పొచ్చన్న, శ్యాంసుందర్, జావిద్ అలీ, గణేశ్, సుకుమార్, పుష్పలత, సంగీత, వినా యక్‌రావు, సాంబన్న, సావ్మి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీలో నగదు బదిలీ చేపట్టాలి



ధర్నాలో పాల్గొన్న యాదవులు

కైలాస్‌నగర్: రెండో విడత గొర్రెల పంపిణీకి నగదు బదిలీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యాదవసంఘ భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, గొర్రెల పంపిణీ కోసం డీడీలు తీసి ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు పంపిణీ చేయలేదన్నారు. చాలామంది అప్పు తెచ్చి మరీ డీడీలు చెల్లించారని, వాటిని చెల్లించలేక, గొర్రెలు రాక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. అర్హులందరికీ ప్రభుత్వం వెంటనే నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదవసంఘ నాయకులు వేణుగోపాల్, నారాయణ, రఘువీర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సంపూర్ణ, కే.రాధ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలను గ్రేడ్–1 ఉద్యోగులుగా గుర్తించి కేజీ టు పీజీ విద్యాసంస్థల్లో విలీనం చేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయస్సును 61 ఏళ్లుగా ప్రకటించాలన్నారు. అలాగే అంగన్‌వాడీలకు రూ.5వేలు, ఆయాలకు రూ.3వేల పింఛన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యలక్ష్మి, గ్యాస్ బిల్లుల చెల్లింపుతో పాటు అద్దె బకాయిలు, టీఏ, డీఏలను తక్షణమే విడుదల చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జ్యోతి, పద్మ, సునీత, సుజాత, విజయ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్టాఫ్ నర్సుల సమ్మె

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్టాఫ్ నర్సులు చేపట్టిన సమ్మె 10వ రోజుకు చేరింది. రిమ్స్ ఎదుట సోమవారం కూడా వారి నిరసన కొనసాగింది. ముందుగా రిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ అశోక్‌తో చర్చలు జరిపారు. అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో సమ్మెను యథావిధిగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఎనిమిది నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు రాజ్యలక్ష్మి, చంద్రకళ, వనజ, పుష్పలత, వెంకటలక్ష్మి, త్రిచరణ తదితరులు పాల్గొన్నారు.



అంతంతే..

- ప్రాజెక్టులకు మాత్రమే ప్రత్యేక కేటాయింపులు
- కుప్టికి దక్కని చోటు..లోయర్ పెన్‌గంగ, సాత్నాల, మత్తడివాగుకు ఓకే
- నెరవేరని 'రిమ్స్' హామీ
- సంక్షేమ, అభివృద్ధిలో కొంత ఊరట
- రాష్ట్ర బడ్జెట్ భేష్ అన్న అధికార పక్షం
- అంకెల గారడీ అంటూ విపక్షాల విమర్శ


సాక్షి,ఆదిలాబాద్: రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు 2023–24 తెలంగాణ వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో సోమవారం ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌పై జిల్లాలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని అధికార బీఆర్‌ఎస్ చెబుతుండగా.. ఇది అంకెల గారడీ అని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఎన్నికల ముందు ప్రజలను మోసం చేసేందుకు మరోసారి అధికార పార్టీ సిద్ధమైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదిలా ఉంటే జిల్లా పరంగా మూడు ప్రాజెక్టులు మినహా ప్రత్యేక కేటాయింపులు అనుకున్న స్థాయిలో కనిపించలేదని తెలుస్తోంది. అయితే రాష్ట్ర పద్దులో జిల్లాకు కూడా అభివృద్ధి, సంక్షేమం జోడించి ఉండటం కొంత ఊరటనిచ్చే అంశం. జిల్లా పరంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిగే ప్రయోజనాలిలా ఉన్నాయి.

ప్రాజెక్టులకు ఇలా..

కుప్టి ప్రాజెక్టును రూ.1,100 కోట్లతో నిర్మించాలని అంచనా వేశారు. కొన్నేళ్లుగా ప్రతీ బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నా మొండి చేయే ఎదురవుతుంది. ఈ సారి అదే పరిస్థితి. ఇక నిర్మాణంలో ఉన్న లోయర్ పెన్‌గంగ పరిధిలోని కోర్టా–చనాఖాబ్యారేజ్‌కు నిధులు కేటాయించారు. సాత్నాల,మత్తడివాగు ఆధునికీకరణ పనుల్లో భాగంగా స్వల్ప కేటాయింపులు చేశారు.

ప్రాజెక్టులకు కేటాయింపులు ఇలా..(రూ.కోట్లలో)

ప్రాజెక్ట్	అంచనా వ్యయం	కేటాయింపు
లోయర్ పెన్‌గంగ (కోర్టా–చనాఖా)	276.73	289.61
సాత్నాల	6.74	5.43
మత్తడి వాగు	4.02	6.72



ప్రజా వ్యతిరేక బడ్జెట్..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్. దళితబంధు తరహాలో గిరిజన బంధు ఇస్తామని చెప్పిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రస్తావించనేలేదు. పోడు భూముల ఊసే లేదు. నిరుద్యోగ భృతి మర్చిపోయారు. ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇస్తామని చెప్పి రూ.3లక్షలకు కుదించారు. బీసీ కులాలకు తీరని ద్రోహం చేశారు. అరచేతిలో వైకుంఠం చూపారు. అన్నివర్గాలను నిరాశపర్చింది.

– సోయం బాపురావు, ఎంపీ, ఆదిలాబాద్

అన్నివర్గాలకు సమ న్యాయం



రాష్ట్ర బడ్జెట్ అన్నివర్గాలకు సమన్యాయం చేసేలా ఉంది. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు జోడెడ్లకు కేటాయింపులు చేయడం జరిగింది. వ్యవసాయానికి పెద్దపీట వేయడం ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ రైతుపక్షపాతి అని మరోసారి నిరూపించుకుంది. రోడ్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించగా.. డబుల్ బెడ్‌రూమ్‌లకు కూడా నిధులు రానున్నాయి. జాగా ఉన్నవారికి నిర్మాణం కోసం రూ.3లక్షలు ఇవ్వనున్నాం.

– జోగురామన్న, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

ప్రగల్భాల బడ్జెట్..



బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రగల్భాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. నిధులు కేటాయించడమే కానీ ఖర్చు చేసింది లేదు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు.

– సాజిద్ ఖాన్, డీసీసీ అధ్యక్షుడు

దళితబంధు..



దళితబంధు ప్రతి నియోజకవర్గంలో 1,100 మందికి ఇవ్వనున్నట్లు బడ్జెట్‌లో వెల్లడించారు. జిల్లాలో మొదటి విడత కింద ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో వంద మంది చొప్పున లబ్ధి చేకూరింది. రెండో విడతలో 500 మందికి ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలు వచ్చినా ఇంకా ప్రారంభం కాలేదు. తాజాగా ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను పెంచింది.జిల్లాలో సుమారు 3వేల మందికి ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

వీరికి ఊరట..



మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాన్ని ప్రభుత్వం రూ.వెయ్యి నుంచి రూ.3వేలకు పెంచుతున్నట్లు బడ్జెట్‌లో స్పష్టం చేసింది. జిల్లాలో 1,700 మందికి ప్రయోజనం దక్కనుంది. అలాగే ఏప్రిల్ నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ మొదలు పెడతామని వెల్లడించింది. జిల్లాలో సుమారు 250 నుంచి 300 మంది ఉన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త ఈహెచ్‌ఎస్ అమలు చేయనున్నట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రస్తావించింది. జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు 8,200 మంది ఉన్నారు. పెన్షనర్లు 5,100 మంది ఉన్నారు. వీరికి లబ్ధి చేకూరనుంది. సెర్ప్ ఉద్యోగుల పేస్కేల్‌ను ఏప్రిల్ నుంచి సవరించనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొంది. జిల్లాలో 153 మందికి మేలు జరగనుంది.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం..

సొంత జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందజేస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలోనే స్పష్టం చేసింది. తాజాగా ఈ బడ్జెట్‌లో దానికి సంబంధించి నియోజకవర్గం వారీగా కేటాయింపులు చేసింది. నియోజకవర్గానికి 2వేల మందికి రూ.3లక్షల చొప్పున సాయం అందిస్తామని స్పష్టం చేసింది. సీఎం కోటాలోనూ కేటాయింపులు చేస్తామని చెప్పారు. తద్వారా జిల్లాలో సుమారు ఐదున్నర వేల మందికి ప్రయోజనం దక్కే అవకాశం ఉంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం బడ్జెట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,210 కోట్లు కేటాయింపులు చేశారు. జిల్లాకు ఇప్పటి వరకు 3,452 డబుల్ బెడ్‌రూమ్‌లు మంజూరు కాగా కేవలం 626 మాత్రమే పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. తాజా కేటాయింపుల ద్వారా జిల్లాలో డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణం వేగిరం అవుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతుంది.



చెరువుల పునరుద్ధరణ జరిగేనా..

జిల్లాలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో రూ. 350 కోట్లతో 35 చెరువుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. ఒక్కో చెరువు కింద సుమారు 200 ఎకరాల ఆయకట్టు ఉండేలా చూస్తున్నారు. అదే విధంగా 70 చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి రూ.120 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణ కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. దీంట్లో జిల్లాకు కూడా ప్రయోజనం దక్కే అవకాశం ఉంది.



కల్యాణలక్ష్మి, షాదీముబారక్..

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.3వేల 210 కోట్లు కేటాయించారు. జిల్లాలో పలువురు అర్హులు ఈ నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణం కోసం ప్రభుత్వం రూ.1500 కోట్ల వెచ్చింపులు చూపింది. జిల్లాలోని ఎస్‌హెచ్‌జీలకు కూడా ప్రయోజనం దక్కనుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్ల నిధులు వెచ్చించింది. తద్వారా జిల్లాలోని ఆయా వర్గాల ప్రజలు కూడా వివిధ సంక్షేమాలు అందుతాయన్న ఆశాభావంలో ఉన్నారు.



రుణమాఫీ ప్రయోజనం..



రైతులకు సంబంధించి రుణమాఫీ కోసం ఈ బడ్జెట్‌లో కేటాయింపులు జరిపారు. ఇప్పటికే రూ.50వేల లోపు ఉన్న వారికి రుణమాఫీ వర్తింపు పూర్తయింది. ఈ విడతలో రూ.లక్ష వరకు ఉన్న వారికి లబ్ధి చేకూరనుంది.

రోడ్లు మరమ్మతు జరిగేనా..



ఆర్‌అండ్‌బీ రోడ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,500 కోట్లు కేటాయించింది. అదేవిధంగా పంచాయతీరాజ్ శాఖకు రూ.31,246 కోట్లు కేటాయించింది. జిల్లాలో ఈ రెండు శాఖకు సంబంధించిన రోడ్లకు సంబంధించి సుమారు రూ.400 కోట్ల ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో రోడ్ల మరమ్మతులు జరుగుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతుంది.

ఆరోగ్యానికి ఇలా..



బడ్జెట్‌లో ఆరోగ్యశాఖకు రూ.12,161 కోట్ల పద్దు కేటాయించారు. రిమ్స్ ఆస్పత్రికి ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని గతంలో జిల్లాలో పర్యటించినప్పుడు మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. అయితే దీనికి ప్రత్యేకంగా కేటాయింపులు చూపలేదు. ఇకపోతే నర్సింగ్ కళాశాలకు భవన నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తామని చెప్పినా ఇందులో ప్రత్యేకంగా కనిపించలేదు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ మరింత వేగవంతం చేయనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు.

స్థానిక సంస్థలకు లబ్ధి చేకూరేనా..



పల్లె, పట్టణ ప్రగతి కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. ఫైనాన్స్ కమిషన్ నిధులు కూడా నేరుగా స్థానిక సంస్థల ఖాతాలోకి బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. తద్వారా జిల్లాలోని ఏకైక మున్సిపాలిటీ ఆదిలాబాద్‌తో పాటు గ్రామపంచాయతీలకు లబ్ధి చేకూరనుంది.

సమస్యలు విని.. భరోసా కల్పించి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- తొలి ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌రాజ్ తీరు
- అర్జీదారులను పదేపదే తిప్పొద్దని అధికారులకు ఆదేశం

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన తొలి ప్రజావాణి బాధితులకు భరోసా కల్పించేలా సాగింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రిజ్వాన్ బాషాషేక్, నటరాజ్‌తో కలిసి బాధితుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం తొలిసారి ప్రజావాణికి కలెక్టర్ రానుండటంతో డీఆర్డీవో, డీఎంహెచ్‌వో, డీపీవో, డీఈవో, డీఎండబ్ల్యూవో మినహా జిల్లాస్థాయి అధికారులంతా నిర్ణీత సమయానికే హాజరయ్యారు. బాధితులు తమ సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. వారి నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ విన్నపాలను ఆలకించారు. భూ సమస్యల పరిష్కారానికి ధరణిలో అన్ని అవకాశాలున్నాయన్నారు. అందులో పరిష్కారం కాని వాటి విషయంలో సివిల్ కోర్టును ఆశ్రయించాలని సూచించారు. అలాగే పింఛన్, సదరం సర్టిఫికెట్లు పొందే విధానంపై స్పష్టంగా వివరించారు. పరిష్కారానికి అవకాశమున్న అర్జీలపై ఎండార్స్ చేసి సంబంధిత అధికారులకు అందజేశారు. నిబంధనలు, అర్హతల మేరకు అర్జీదారుల సమస్య పరిష్కారమయ్యేలా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే దరఖాస్తుకు సంబంధించిన సమాచారాన్ని రాత పూర్వకంగా స్పష్టమైన వివరణతో అర్జీదారునికి తెలియజేయాలన్నారు. బాధితులు ఒకే సమస్యపై పదేపదే ప్రజావాణికి రాకుండా శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతీ జిల్లాస్థాయి అధికారి ప్రజావాణికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజ, జెడ్పీ సీఈవో గణపతి, ఆర్డీవో రమేశ్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా అధికారులు హెడ్‌క్వార్టర్ దాటొద్దు..

జిల్లా స్థాయి అధికారులు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లవద్దని కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పష్టం చేశారు. ప్రతి నెల 3వ తేదీన, ఆ రోజు సెలవుంటే మరుసటి రోజున జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజావాణి అర్జీల స్వీకరణ అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. వారికి దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించేందుకు యంత్రాంగం సమష్టిగా పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలపాలన్నారు. గ్రీవెన్స్‌లో అందే దరఖాస్తుల సంఖ్యను తగ్గించాలన్నారు. సంక్షేమ శాఖల సహకారంతో ఉపాధి కల్పన అవకాశాలను సాధ్యమైనంత వరకు కల్పించాలన్నారు. ఈ నెల 8న జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గడిచిన రెండేళ్లలో ఆయా శాఖలు చేపట్టిన ప్రగతి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. 9న ఐటీడీఏ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై ఉట్నూర్‌లో సమీక్ష ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎన్.నటరాజ్, రిజ్వాన్ బాషా షేక్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. డీఈవో కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియపై ఆరా తీశారు. డీఈవో ప్రణీత అడిగి వివరాలు తెలుసుకున్నారు. అభ్యంతరాలు ఉంటే గ్రీవెన్స్ నిర్వహించి పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో 1,096 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, బదిలీల కోసం 1,605 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 21 దరఖాస్తులను తిరస్కరించినట్లు డీఈవో వివరించారు. మిగతా వారిని ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. మంగళవారం సీనియారిటీ జాబితాను విడుదల చేస్తామని, అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల పాటు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ వెంట విద్యాశాఖ ఏడీ నర్సింలు, సెక్టోరియల్ అధికారులు నర్సయ్య, ఉదయశ్రీ, నారాయణ, సుజాత్ ఖాన్, మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.

అణగారిన వర్గాలకు ఉచిత న్యాయసేవలు



వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్



భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి ఎంఆర్.సునీత

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్
- వర్చువల్‌లో ఎల్‌ఏడీసీఎస్ భవనం ప్రారంభం

కైలాస్‌నగర్: అర్హులైన అణగారిన వర్గాలకు ఉచిత న్యాయసేవలు అందించడమే లక్ష్యంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్(ఎల్‌ఏడీసీఎస్) పనిచేస్తుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఏడీసీఎస్ భవనాన్ని సోమవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించి ప్రసంగించారు. తెలంగాణలోని 16 జిల్లాల్లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సిస్టం సేవలు అందుబాటులోకి రావడం హర్షనీయమన్నారు. ప్రస్తుతం జైళ్లలో 80శాతం మంది ఖైదీలు అండర్ ట్రయల్‌లో ఉండగా, వారిలో ఎక్కువగా అట్టడుగు, బలహీనవర్గాలకు చెందినవారు ఉన్నారన్నారు. ఈ సిస్టం ద్వారా వారికి న్యాయసేవలు అందుతాయన్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్.సునీత రిబ్బన్ కట్‌చేసి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏడాదికి రూ.30వేలకు మించి ఆదాయం ఉండని నిరుపేదలకు ఈ సిస్టం ద్వారా ఉచిత న్యాయ సహాయం,న్యాయసేవలు అందించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులను నియమించుకునే ఆర్థిక స్థోమతలేని పేదలు, బాధిత మహిళలు, చిన్నారులు ఈ కేంద్రం అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, న్యాయమూర్తులు ప్రమీళజైన్, మంజుల, యశ్వంత్‌సింగ్ చౌహాన్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, న్యాయవాదులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

ఇంద్రవెల్లి: గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేసి గడువులోగా వందశాతం పూర్తి చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. ఇంటి పన్ను వసూళ్ల రికార్డులను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ గాంధారి సుంకట్‌రావ్, ఈవో సంజీవ్‌రావ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'మహా' దందా

- మహారాష్ట్ర నుంచి జిల్లాకు ఇసుక అక్రమ రవాణా
- రోజుకు వందల లారీల్లో తరలింపు
- ప్రభుత్వానికి లక్షల్లో రాయల్టీ ఎగవేత
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



మహారాష్ట్ర అనుమతి ఉందని అన్‌లోడ్ అవుతున్న ఇసుక లారీ

బోథ్: తెలంగాణలో ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ జిల్లాకు లారీల్లో తరలిస్తున్నారు. ఇసుక వ్యాపారులు ప్రభుత్వానికి లక్షల్లో రాయల్టీ ఎగ్గొట్టి తీసుకువస్తున్నారు. రోజుకు వందల లారీల్లో తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ దందాలో కీలకంగా ఉన్న పలువురు అధికారులు, నేతలకు వ్యాపారులు మామూళ్లు ముట్టజెప్పుతున్నారు. ఓ మండలంలో అక్రమంగా ఇసుక వచ్చిందని అధికారులకు సమాచారమిచ్చినా మా పరిధి కాదంటూ దాటవేయడం ఇందుకు నిదర్శనం.

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

మహారాష్ట్ర నుంచి తెలంగాణ జిల్లాలకు ఇసుక తరలించాలంటే ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. కాని వ్యాపారులు అక్రమంగా తరలించడంతో రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఆదాయం కోల్పోతోంది. అక్కడి నుంచి ఆదిలాబాద్ జిల్లాకు రోజుకు వంద లారీల్లో తరలిస్తున్నారు. 12 టైర్లు గల లారీ 26 మెట్రిక్ టన్నులు, 14 టైర్లవి 32 మెట్రిక్ టన్నుల కన్నా మించి ఇసుకను రవాణా చేయకూడదు. 14 టన్నుల లారీలో ఓవర్‌లోడ్లతో 45 టన్నులు, 12 టైర్ల లారీలో 38 టన్నుల ఇసుక రవాణా అవుతోంది. తెలంగాణలో ఇసుక రవాణా చేయాలంటే టీఎస్ఎండీసీలో దరఖాస్తు చేయాలి. ఒక మెట్రిక్ టన్నుకు రూ.375 రాయల్టీగా చెల్లించాలి. ఆన్‌లైన్‌లో ఇసుక రవాణాకు సంబంధించి పాస్ లభిస్తోంది. ఇసుక తీసుకెళ్లే రూట్‌తోపాటు, దరఖాస్తుదారుని పేరు, ఎక్కడి నుంచి ఎక్కడికి రవాణా అవుతోంది. సమయం, తేదీతోపాటు అనుమతి కాపీని అందిస్తారు.

గడ్చిరోలి నుంచి ఇసుక తరలింపు

గడ్చిరోలి నుంచి మహారాష్ట్రకు ఇసుక తరలింపు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. గడ్చిరోలి నుంచి చంద్రాపూర్ మీదుగా కోర్పానా నుంచి బేల, జైనథ్ మీదుగా చందా(టి) గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి లారీలు చేరుకుంటున్నాయి. భోరజ్‌లో ఉన్న చెక్‌పోస్టును తప్పించేందుకు చాంద(టి) మీదుగా ఇసుక లారీలు జిల్లా కేంద్రానికి అటు నుంచి మండలాలకు తరలిస్తున్నారు. అయినా ఏ ఒక్క అధికారి ఇసుక లారీలపై నిఘా పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మహారాష్ట్రలోని అధికారులు ఇచ్చిన అనుమతి తెలంగాణలో పనిచేయదు. అక్కడ ఇచ్చిన అనుమతిపత్రాన్ని లారీల యాజమాన్యాలు చూపిస్తున్నాయి.

ఓవర్‌లోడ్‌తో వెళ్తూ..

లారీలు పరిమితికి మించి ఇసుకను రవాణా చేస్తున్నాయి. ప్రభుత్వం విధించిన పరిమితి కంటే ఏకంగా 11 నుంచి 15 మెట్రిక్ టన్నుల ఇసుకను రవాణా చేస్తోంది. దీనివల్ల రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఆర్టీఏ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. 14 టైర్ల లారీ 32 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇసుక రవాణా అనుమతి ఉంది. ఒక్కో లారీలో 45 మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా చేస్తోంది. 12 టైర్ల లారీ 26 మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా చేయాలి. కాని 35 మెట్రిక్ టన్నుల వరకు రవాణా చేస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థకు రాయల్టీ కట్టకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. అక్రమంగా ఇసుక తరలిస్తే లారీలు సీజ్ చేసి భారీ జరిమానా విధిస్తాం. అక్రమ ఇసుక తరలిస్తే సమాచారమివ్వాలి.

– తారకనాథరెడ్డి, టీఎస్ఎండీసీ పీడీ

క్లుప్తంగా

మహిళ అదృశ్యం


పూజ (ఫైల్)

తానూరు: మండల కేంద్రానికి చెందిన పందిరివాడ్ పూజ(26) కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. పూజ ఆదివారం మధ్యాహ్నం 3:15 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా దొరకలేదు. ఫోన్లలో బంధువులతో మాట్లాడి ఆరా తీసిన ఫలితం లేకపోయింది. సోమవారం బాధితురాలి భర్త రాజు ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో ఒకరిని దూషించిన వ్యక్తిపై టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈనెల 1న రాత్రి పట్టణంలోని వెంకటేశ్వరా బార్ వాచ్‌మెన్‌తో పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన ఎండీ అమన్ గొడవపడ్డాడు. ఆ సమయంలో అటు వైపుగా వెళ్తున్న ఫిల్టర్‌బెడ్‌కు చెందిన గాజువార్ శివకుమార్ వారిని సముదాయించే ప్రయత్నం చేశాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న అమన్ శివకుమార్‌ను పరుషపదజాలంతో దూషించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు

ఆదిలాబాద్‌టౌన్: భార్యను వేధించిన కేసులో మహారాష్ట్రలోని పార్వా గ్రామానికి చెందిన దక్షిత్‌కు 18 నెలల జైలుశిక్షతో పాటు రూ.2500 జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి యశ్వంత్‌సింగ్ చౌహాన్ సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. 2010లో మహారాష్ట్రలోని పార్వా గ్రామానికి చెందిన సావాపూరె దక్షిత్‌కు జైనథ్ మండలం నీరాల గ్రామానికి చెందిన మహిళతో వివాహం జరిగింది. కొన్నేళ్లు వీరి కాపురం సజావుగానే సాగింది. 2018లో అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించగా ఆమె జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై పుల్లయ్య కేసు నమోదు చేశారు. ఏపీపీ నవీన్‌కుమార్ కోర్టులో 8 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చారు.

'అగ్నిపథ్' ఉద్యోగం రాలేదని ఆత్మహత్య


కార్తీక్(ఫైల్)

తాంసి: కేంద్రం సైనిక నియామకాల్లో భాగంగా ప్రవేశపెట్టిన అగ్నిపథ్ ఉద్యోగం రాలేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కప్పర్ల గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కప్పర్ల గ్రామానికి చెందిన సాదరి కార్తీక్ (21) డిగ్రీ వరకు చదువుకున్నాడు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నాడు. ఇటీవల జరిగిన అగ్నిపథ్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు. పరీక్షల కోసం సిద్ధమై ఇటీవల జరిగిన వివిధ పోటీల్లో అన్నింటిలో ప్రతిభ కనబర్చాడు. అయితే ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉద్యోగం రాలేదు. తీవ్ర మనస్తాపంతో గ్రామ సమీపంలోని పంటచేనులో సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, కూలీలు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకుని ఇన్‌చార్జి ఎస్సై రాధిక..మృతదేహన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. తండ్రి మోహన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు. అయితే ఉద్యోగం ఇప్పిస్తామని మధ్యవర్తి డబ్బులు తీసుకుని మోసగించడంతో కార్తీక్ ఆత్మహత్యకు పాల్పడ్డారని స్థానికులు ఆరోపించారు.

పోగొట్టుకున్న బంగారు మాటీలు అందజేత


బంగారు మాటీలను అందిస్తున్న ఎస్సై

దస్తురాబాద్: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ప్రాంతంలో సోమవారం ఓ మహిళ బంగారు మాటీలు పోగొట్టుకుంది. కడెం మండలం నవాబుపేటకు చెందిన ఆశకార్యకర్త విజయ పాండ్వాపూర్ గ్రామం వద్ద ఆటోలో దస్తూరాబాద్ బస్టాండ్‌కు బయల్దేరింది. అక్కడి చేరుకున్నాక ఆటోడ్రైవర్‌కు డబ్బులు ఇస్తుండగా పర్సులో ఉన్న బంగారు మాటీలు కిందపడ్డాయి. తర్వాత గుర్తించిన బాధితురాలు ఎస్సై ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. ఆయన స్పందించి సిబ్బందితో నిఘా పెట్టి బంగారు మాటీలను దొరికిన వారిని గుర్తించి రికవరీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో విజయకు బంగారు మాటీలు అందించారు.

ఘనంగా హీరసుక జయంతి వేడుకలు


మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ప్రధాన్‌గూడలో ఆదివాసీ పురోహిత్ ప్రధాన్ సమాజ్ సంఘ్ ఆధ్వర్యంలో గోండ్వానా ధర్మగురు హీరసుక జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్‌లు హీరాసుక్క చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన్ సమాజ్ విన్నపం మేరకు హీరసుక మందిరం నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులను సన్మానించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, ప్రధాన్ సమాజ్‌పెద్దలు గేడం జ్ఞానేశ్వర్, మడావి విశ్వనాథ్, మెస్రం శ్రీధర్, సోయం రాందాస్, మరప రాజు, ఆదివాసీ పురోహిత్ ప్రధాన్ సమాజ్ అధ్యక్షుడు గేడం భరత్, నాయకులు తొడసం సాగర్, కోరెంగా సుంకట్‌రావ్, దీపాక్‌సింగ్ షెకావత్, ఆర్క ఖమ్ము, ఉత్తం కాంబ్లే, లహుదాస్, విజయ్‌కుమార్, దాదారావ్ ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి

- నూతన పర్యావరణ చట్టంతో ఆదివాసీలకు నష్టం
- టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాపురావు


మాట్లాడుతున్న మిడియం బాపురావు

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపారని టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాపురావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జనార్దన్‌రెడ్డి గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యకు పది శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, కేవలం రెండు శాతానికే పరిమితం చేశారని పేర్కొన్నారు. అంబేద్కర్ జీవిత చరిత్ర చదవాల్సిన చోట ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన చరిత్రలను చదివిస్తున్నారని విమర్శించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం తరగతికో ఉపాధ్యాయుడిని నియమించాల్సి ఉన్నా ఆ పరిస్థితి కానరావడం లేదన్నారు. రేషనలైజేషన్ పేరిట బడులను మూసివేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. అలాగే నూతన పర్యావరణ చట్టం ఆదివాసీలకు నష్టం చేకూరే విధంగా ఉందన్నారు. అడవి నుంచి గిరిపుత్రులను వెళ్లగొట్టే యత్నాలకు పాల్పడుతోందన్నారు. అంతకుముందు సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మేస్రం రాజు, పూసం సచిన్, టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్, లంకా రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు ఉచిత శిక్షణ

ఉట్నూర్: ఆదివాసీ చిత్రకళలు, గోండి పెయింటింగ్స్‌లో గిరిజన యువతకు రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు పదోతరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలతో ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 10న హాజరుకావాలని సూచించారు. శిక్షణ అనంతరం వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉపాధి కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఐటీడీఏ జాబ్ డిస్ట్రిక్ మేనేజర్‌ను 9032839993 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆలయ మండపానికి రూ. కోటి విరాళాలు

ఇచ్చోడ: మండలంలోని నర్సపూర్ గ్రామంలో విఠలేశ్వర ఆలయ మండప నిర్మాణం కోసం సోమవారం గ్రామస్తుల రూ.కోటి రూపాయల విరాళాలు వసూళ్లు చేసినట్లు గ్రామపెద్దలు తిడ్కె రాంచందర్, దుర్వముండే, బాబుముండే తెలిపారు. ఒకేరోజు కోటి రూపాయల విరాళాలు వసూల్ అయినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. త్వరలో ఆలయ మండప నిర్మాణం పనులు చెపట్టనున్నాట్లు వారు తెలిపారు.

కేటాయింపులు ఘనం.. ఆచరణ శూన్యం

నేరడిగొండ: 2023–24 వార్షిక బడ్జెట్‌లో కేసీఆర్ సర్కారు కేటాయింపులు ఘనంగా చేసినా ఆచరణలో మాత్రం శూన్యమేనని తెలంగాణ జన సమితి రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు కాంతి మోహన్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు రుణమాఫీ ఇప్పటి వరకు అమలు కాలేదని, ఈ బడ్జెట్ వారికి ఉపయోగం లేదని మండిపడ్డారు. పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని, గతేడాది ఉన్న పత్తి ధర ఇప్పుడు లేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల అధ్యక్షులు ఆడే సునీల్ కుమార్, కడపత్రి తిలక్‌రావ్, నాయకులు వినయ్ కుమార్, శంకర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ

తాంసి: మండలంలోని హస్నాపూర్ సమీపంలో అంతరాష్ట్ర రహదారిపై ఉన్న మూలమలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న లారీ, బైక్ సోమవారం ఢీకొన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్‌లోని ఖుర్షీద్‌నగర్ కాలనీకి చెందిన మహ్మద్ ఖాలీం బైక్‌పై మహారాష్ట్ర వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మహారాష్ట్ర నుంచి లారీ ఆదిలాబాద్ వైపు వస్తుండగా హస్నాపూర్ సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మహ్మద్ ఖాలీం కాలు విరగడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

వన్యప్రాణిని వేటాడిన నిందితుడి అరెస్టు


నిందితుడితోపాటు పట్టుకున్న వన్యప్రాణి మాంసంతో అధికారులు

ఖానాపూర్: ఖానాపూర్ అటవీరేంజ్ పరిధిలో వన్యప్రాణిని వేటాడిన కేసులో నిందితుడు పిట్టల చిన్నబక్కన్నను అటవీ అధికారులు సోమవారం అరెస్టు చేశారు. స్థానిక కోర్టులో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. ఖానాపూర్ ఫస్ట్ క్లాస్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ 15 రోజుల రిమాండ్ విధించారని ఎఫ్ఆర్‌వో వినాయక్ తెలిపారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్


గిరిజనుల అర్జీలు స్వీకరిస్తున్న భీంరావ్

ఉట్నూర్: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి 52 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా భీంరావ్ మాట్లాడుతూ ప్రతి అర్జీని అధికారులు పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఓఎస్‌డీ కిష్టయ్య, జేడీఎమ్ నాగాభూషణం హెచ్‌వో సుధీర్, డీపీవో ప్రవీణ్, ఏవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

- తాను దివ్యాంగురాలిని పింఛన్ మంజూరు చేయాలని గుడిహత్నూర్ మండలం దరమడుగుకు చెందిన సిడాం జమునబాయి అర్జీ పెట్టుకుంది.
- రైతుబంధు ఇప్పించాలని జన్నారం మండలం కొత్తపేట్‌కు చెందిన పవార్ దినేశ్ విన్నవించాడు.
- గిరివికాసం పథకం ద్వారా పంట చేనుకు బోరుబావి, విద్యుత్ మోటారు మంజూరు చేయాలని నార్నూర్ మండలం బాబేఝరికి చెందిన కుర్సింగ కర్ణుబాయి వేడుకుంది.
- తాను సాగు చేసుకుంటున్న ఆర్‌ఎఫ్‌ఆర్ అటవీ భూమికి విరాసత్ పట్టా చేయాలని జన్నారం మండలం కవ్వాల్‌కు చెందిన కొడప అయ్యుబాయి విన్నవించింది.
- పంట సాగు కోసం ఎడ్ల జత మంజూరు చేయాలని జైనూర్ మండలం పోచంలొద్దికి చెందిన ఆత్రం భాస్కర్ అర్జీ పెట్టుకున్నారు.

'కోత'ల ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- బీజేపీ నాయకుడు పవార్ రామారావ్‌పటేల్
- రైతులతో కలిసి భైంసాలో రాస్తారోకో


రాస్తారోకో చేపడుతున్న రామారావ్‌పటేల్, రైతులు

భైంసాటౌన్: రాష్ట్రంలో వ్యవసాయరంగానికి విద్యుత్ కోతలు విధిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీజేపీ నాయకుడు పవార్ రామారావ్‌పటేల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రైతులకు కరెంటు సరఫరాలో కోతలు నిరసిస్తూ డివిజన్‌పరిధిలోని రైతులతో కలిసి సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు 24 గంటలు కరెంటు ఇవ్వని సీఎం కేసీఆర్, నాందేడ్ సభలో పచ్చి అబద్ధాలు మాట్లాడారన్నారు. కరెంటు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రైతులు రోజంతా పంటపొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. పంటలు ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయని, రైతులకు కోతలు లేని విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వారితో కలిసి భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ అక్కడికి చేరుకుని ధర్నా విరమించాలని కోరగా, విద్యుత్ అధికారులు వచ్చే వరకు విరమించేది లేదన్నారు. అనంతరం ఏడీఈ అక్కడికి చేరుకోగా విద్యుత్ కోతలపై ఆయన్ను నిలదీశారు. వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి గంగాధర్, నాయకులు రవిపాండే, నారాయణ్‌రెడ్డి, గోపాల్‌సర్డా, కుంటాల ఎంపీపీ ఆప్క గజ్జారాం, నాగేశ్, రాజన్న, మహాగాం సర్పంచ్ రాకేశ్, భైంసా మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, శ్రీనివాస్ ఉన్నారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి


ఇచ్చోడలో రాస్తారోకో చేస్తున్న రైతు సంఘాల నాయకులు

- అఖిలపక్షం, రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

ఇచ్చోడ: పత్తికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని అఖిలపక్షం రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. క్వింటాల్ పత్తి ధర రూ.9 వేలు చెల్లించి వ్యాపారులు కొనుగోళ్లు చేశారన్నారు. పంట చేతికి వచ్చేసరికి ధర రూ.7400లు ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు క్వింటాల్ పత్తిని కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాస్తారోకో చేస్తున్న వారిపై పోలీసులు అత్యుత్సాహం చూపడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న, భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు మారుతి, రైతు సంఘాల నాయకులు రాంరెడ్డి, నారాయణరెడ్డి, మల్కన్న, కాంగ్రెస్ నాయకులు నరేష్‌జాదవ్, అడెగ జేందర్, వన్నెల అశోక్, మల్లెపూల నర్సయ్య, మహిముద్‌ఖాన్‌లు రాస్తారోకోకు మద్దతు తెలిపారు.

ఇంద్రవెల్లి: పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐసీసీ రీసెర్చ్ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ ఆరోపించారు. రైతులతో కలిసి మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సోమవారం రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావ్, నాయకులు సోమసే వెంకట్‌రావ్, మహ్మద్ జహీర్, ముఖడే ఉత్తం, గాయక్‌వాడ్ భగవాన్, సోన్‌కాంబ్లే బావురాజ్, పవార్ దుదిరారం, ఫిరాజీ ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


గోదావరిలో స్వామివారి చక్రస్నానం

కడెం: అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి గ్రామాల పురవీధుల గుండా సాగింది. స్వామివారి ఉత్సవమూర్తులను గోదావరిలో చక్రస్నానం చేయించారు. పుష్పయాగం, నాగవెల్లి నిర్వహించినట్లు అర్చకుడు వంశీకృష్ణామాచార్యులు, చైర్మన్ రాజా రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు. రథో త్సవం సందర్భంగా నిర్వహించిన జాతరకు భక్తులు వచ్చారు.

చింతగూడెం అబ్బాయి.. మయన్మార్ అమ్మాయి


దండలు మార్చుకుంటున్న రవి దంపతులు


రవి తల్లిదండ్రులతోపాటు వధువు తమ్ముడు

- దేశాలు వేరైనా మనసులు కలిశాయి
- క్రైస్తవ సంప్రదాయం ప్రకారం వివాహం

గుడిహత్నూర్: అతడేమో గుడిహత్నూర్ మండలం చింతగూడకు చెందిన గొల్లపల్లి రవి.. ఆమెనేమో మయన్మార్ దేశంలోని ఇన్సైన్ పట్టణానికి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన జిన్ న్వే థీయోన్. వీరిద్దరు ఉపాధి నిమిత్తం ఖతర్ దేశానికి వెళ్లి అక్కడ హోటళ్లో పనిచేస్తుండగా ఇద్దరు మనస్సులు కలిశాయి. ఇరు కుటుంబాలను సంప్రదిస్తే వారు వివాహానికి సమ్మతించారు. ఇంకేముందు సీన్ కట్ చేస్తే.. సోమవారం రవి స్వగ్రామం చింతగూడలో వారిద్దరికి సంప్రదాయం ప్రకారం పెళ్లి జరిగింది. అయితే ఈ జంటను చూస్తున్నవారికి ముచ్చట గొలిపింది. ప్రేమకు భాష, దేశ హద్దులు అడ్డురావని నిరూపించారు ఈ ప్రేమికులు. మండలంలోని చింతగూడెం గ్రామానికి చెందిన గొల్లపల్లి రవి ఆరేళ్ల క్రితం ఉపాధి కోసం ఖతర్ దేశం వెళ్లాడు. అక్కడ దోహా పట్టణంలోని హోటల్లో పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో అదే హోటల్లో పనిచేస్తున్న మయన్మార్ దేశంలోని ఇన్సైన్ పట్టణానికి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన జిన్ న్వే థీయోన్‌తో పరిచయం ఏర్పడి ప్రేమలో పడ్డారు. ఇద్దరి మనసులు ఒకటయ్యాయి. వీరి ప్రేమ వ్యవహారంను ఇరు కుటుంబాలకు తెలిపారు. వీరి ప్రేమను అర్థం చేసుకొని వారు స్వాగతించారు. రవి స్వగ్రామమైన చింతగూడెంలో క్రైస్తవ సంప్రదాయ బద్ధంగా పెళ్లికి నిశ్చయించారు. ఈ క్రమంలో సోమవారం గ్రామంలోని చర్చిలో పెళ్లి చేసుకొని ఈ జంట ఒక్కటయ్యారు. వరుడు తరఫున బంధుమిత్రులు హాజరుకాగా, వధువు తరఫున ఆమె సోదరుడు క్వేక్వే థీయన్ హాజరై ఇక్కడి పెళ్లి తంతు సంప్రదాయాలను తన మొబైల్ ద్వారా మయన్మార్ లోని తన కుటుంబ సభ్యులకు చేరవేశాడు. వరుడు రవి కుటుంబ సభ్యులు ఎంతో ఆనందంతో వధువును తమ కుటుంబంలోకి స్వాగతించారు.

వద్దు..పొమ్మంటున్నారు



వృద్ధాప్య సమయంలో తల్లిదండ్రుల బాగోగులు చూడాల్సిన కుమారులు వారిని వద్దు..పొమ్మంటున్నారు. తమ బాధ ఎవరికీ చెప్పుకోవాలో తెలియక తల్లడిల్లుతున్నారు. లోకేశ్వరం మండలం భాగాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు ముగ్గురు కుమారులు. వారికి పెళ్లిళ్లు అయ్యాయి. వేరువేరుగా ఉంటున్నారు. వృద్ధుల ఆస్తిని పంచుకుని వద్దంటున్నారు. చిన్న కుమారుడి సహాయంతో తమను పట్టించుకోని ఇద్దరు కుమారులపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు ఆ వృద్ధ దంపతులు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్